## క్లుప్తంగా

### తెలంగాణ ఈసీని సత్కరించిన పద్మశాలీ సంఘ నేతలు



**జగ్గయ్యపేట అర్బన్:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు అఖిలభారత పద్మశాలీ సంఘ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జగ్గయ్యపేట పట్టణ వాసి, అఖిలభారత పద్మశాలీ ఇంటలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, కోస్తా జిల్లాల పద్మశాలీ సంఘ కన్వీనర్ కోసూరు మణి, పారిశ్రామికవేత్త, పద్మశాలీ సంఘ రాష్ట్ర నాయకుడు పున్నం రామచంద్రరావు, పద్మశాలీ చేనేత రీజనల్ కో ఆర్డినేటర్ వానపల్లి త్రిమూర్తులు, పద్మశాలీ డాక్టర్స్ విభాగం నేత చలపతి, సంఘ నేతలు వాన పల్లి రవి, రాము తదితరులు హైదరాబాద్‌లో ఆయనను కలిసి కనకదుర్గ అమ్మవారి చిత్రపటంతో సత్కరించామని తెలిపారు.

### 118 మందికి వైద్య పరీక్షలు



**బూదవాడ(జగ్గయ్యపేట):** స్థానిక కర్మాగారంలో ప్రమాదం జరిగిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కంపెనీ ఆవరణలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీసీహెచ్ఎస్ నాయక్ ఆధ్వర్యంలో వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 118 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రి వైద్యులు శ్రీనివాస్, హరినాథ్, సంపత్ బెనర్జి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, జగ్గయ్యపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కర్మాగారంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయటంతో గ్రామం నుంచి రెండు కి.మీ దూరం వెళ్లి వైద్యం ఎలా చేయించుకోవాలని కొందరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉండేదని పలువురు బాధితులు అంటున్నారు.

### దోమల లార్వా దశను నిర్మూలించండి



**చాట్రాయి:** అంటు వ్యాధులు ప్రబలకుండా నిల్వ నీటిల్లో దోమల లార్వా పెరుగుదలను నిర్మూలించాలని ఎంటమాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ బీఎల్ఎస్ కుమార్ అన్నారు. మండలంలోని చీపురుగూడెంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ఇటీవల జ్వరాలు రావడంతో ఇంటింటా జ్వరాలపై సర్వే చేశారని, జ్వర పీడితులకు వైద్య సేవలందించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సురేష్ కుమార్, జిల్లా ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మీ, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాద్, సీహెచ్ఓ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

### 18 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

**తిరువూరు:** మండలంలోని లక్ష్మీపురం పాలశీతల కేంద్రం వద్ద ఈ నెల 18 నుంచి అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు సహకారంతో ఈ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. అన్ని ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి



**ఇబ్రహీంపట్నం:** నది పరీవాహక గ్రామాల ప్రజలు ప్రకృతి వైపరీత్యాలపై అప్రమతంగా ఉండాలని సబ్ కలెక్టర్ సీహెచ్ భవానీశంకర్ అన్నారు. వరద ముంపునకు గురైన సమయాల్లో చేపట్టాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చేపట్టిన ట్రయల్ రన్‌ను పవిత్ర సంగమం వద్ద మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో అవలంబించాల్సిన విధి విధానాలను తెలిపారు. వ్యక్తుల ప్రాణాలు, పశుసంపద, వ్యవసాయ పంట పొలాలు రక్షించుకునే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులు ముమ్మరం

- డయేరియా నేపథ్యంలో కదిలిన యంత్రాంగం
- డ్రెయినేజీలో పూడిక తీత
- విజయవాడ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్



ప్రధాన వీధిలోని డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఇటీవల డయేరియా వ్యాధికి పలువురు గురవడంతో పట్టణంలో పారిశుద్ధ్య వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. వర్షాలు కూడా కురుస్తుండటంతో ముందుగా పట్టణంలోని ప్రధాన వీధులైన కోదాడ రోడ్, విజయవాడ రోడ్, ముక్త్యాల రోడ్, బస్టాండ్ కూడలి, పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, పెద్ద సెంటర్ (బలుసుపాడు సెంటర్) తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లలో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదిక చేపట్టారు. మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందిని రంగంలోకి దించి ప్రధాన వీధులకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లపై సిమెంట్ మూతలు, స్లాబులను తొలగించి ఎప్పటి నుంచో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టారు. గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో కంప చెట్లు, పిచ్చి మొక్కలను కూడా తొలగించే పనులు చేపట్టారు. మున్సిపల్ డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, శానిటరీ మేస్త్రులు, సచివాలయాల ఎమినిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

–జగ్గయ్యపేట అర్బన్



విజయవాడ రోడ్డు పక్కన పొక్లెయిన్‌తో జంగిల్ క్లియరెన్స్



పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు

## వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి

**జగ్గయ్యపేట అర్బన్:** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి సూచించారు. మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి హెల్మెట్ ధరించేందుకు అవగాహన సదస్సు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు అధ్యక్షతన నిర్వహించారు. న్యాయమూర్తులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు జరిగిన ప్రమాదాల్లో ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తలకు తగిలిన గాయాల వలన మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఏజీపీ టీఎల్.నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు పి.సత్య శ్రీనివాసరావు, కె.నరసింహారావు, జి.లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, గాంధీ, కె.శ్రీనివాసరావు, రాజేష్, మహిళా న్యాయవాదులు అమ్ములు, వాసవి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, పక్కన జడ్జి శోభారాణి తదితరులు

## విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

వ్యవసాయ శాఖ ఏడీ భవాని

**తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట):** రైతులు విత్తన ఎంపికలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ భవాని పేర్కొన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలో భూసార పరీక్షల ఫలితాలు, సమతుల ఎరువుల వాడకంపై రైతులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. ఆ ఫలితాల ప్రకారం విత్తన ఎంపిక చేసుకోవాలని తెలిపారు. సమతుల ఎరువుల వాడకంపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఇష్టారనుసారం ఎరువులు వాడటం వల్ల పంట నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే కో ఆర్డినేటర్ కృష్ణంరాజు, ఏవో వరలక్ష్మి, తదితరుల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ భవాని

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఇబ్రహీంపట్నం:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా కోరారు. విజయవాడలోని సచివాలయ శాఖ రాష్ట్ర సంచాలకులు శివప్రసాద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు వివిధ శాఖల్లో పదోన్నతులు కల్పించాలని, ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని మాతృ సంస్థలకు అప్పగించాలని కోరారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం యువ ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలన్నారు. వన్‌టైమ్ ఆప్షన్ ద్వారా ఖాళీగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. మున్సిపాల్టీగా మారిన గ్రామ సచివాలయ ఉద్యోగులను వార్డు సచివాలయ ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



రాష్ట్ర సంచాలకులు శివప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

## హెల్మెట్ ధారణ తప్పనిసరి

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

**నూజివీడు:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. పట్టణంలోని కోర్టు భవనాల హాల్‌లో మంగళవారం హెల్మెట్ ధారణపై న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి నాగశైలజ మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, దానిని ప్రతి ఒక్కరూ కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. రూ.10 వేలతో ఫోన్‌ను కొంటేనే అది పగలకుండా కవర్లు వేయిస్తున్నామని, ఎంతో విలువైన ప్రాణాన్ని కాపాడుకునేందుకు హెల్మెట్‌ను ధరిస్తే తప్పేంటని జడ్జి ప్రశ్నించారు. తల మీదేనని, రక్షణ కూడా మీదేనని, ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి రక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలను తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద్దఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు. న్యాయవాదులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

**ముసునూరు:** వ్యక్తి అదృశ్యంపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రేనిపాడుకు చెందిన పర్వతనేని వెంకట గోవర్ధన్‌కు ముగ్గురు కుమారులు. అతని రెండో కుమారుడు రామకృష్ణ సోమవారం రాత్రి 11.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద విచారణ చేసినా ఆచూకీ లభించలేదు. గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### జీతాలు చెల్లించండి

**నందిగామ:** నియోజకవర్గ వ్యాప్తంగా 108,104,102లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడం వలన సంబంధిత వాహనాలలో పనిచేస్తున్న సిబ్బంది ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యం ప్రజలకు సేవలందిస్తున్న వారికి వెంటనే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

### రేపు ఆలయ భూముల కౌలు వేలం

**నందిగామ:** మండలంలోని లింగాలపాడు గ్రామంలో శ్రీలక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయ భూముల కౌలు వేలం ఈనెల 11న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఫణికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగాలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల పరిధిలో ఆలయానికి గల 24 ఎకరాల భూమి కౌలు హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలన్నారు. వివరాల కోసం ఆలయం వద్ద సంప్రదించ వచ్చన్నారు.

### 16న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**కంచికచర్ల:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఏ దీప్తి మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచులు, సంబంధిత అధికారులు తప్పక హాజరు కావలసినదిగా కోరారు. సమావేశానికి అధికారులు తప్పనిసరిగా నివేదికలను ఒక రోజు ముందుగా తనకు అందజేయాలన్నారు. అధికారులు ఎవరైనా ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి హాజరుకాకపోతే, జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

### విద్యార్థులకు సులభరీతిలో బోధించాలి

**జగన్నాథపురం(వీరులపాడు):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో పాల్ కెనడీ పేర్కొన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగ బాలలను ఆదరించాలి

**ముసునూరు:** దివ్యాంగ బాలలు ముందడుగు వేయాలంటే వారికి ఆదరణ అవసరమని హెచ్ఎం లోకరాజు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ బాబు, ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దివ్యాంగ బాలికకు ఫిజియో థెరపీ చేస్తున్న దృశ్యం

## ఉచిత ఇసుక ఇచ్చి ఎన్నికల హామీ నెరవేర్చాం

**జగ్గయ్యపేట అర్బన్:** ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టి నిర్మాణ రంగానికి పూర్వవైభవం తెచ్చారని, ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టడం గొప్ప నిర్ణయమని, ఇది ప్రజా ప్రభుత్వం పేదలకు ఇచ్చే కానుక అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టిన సందర్భంగా మంగళవారం స్థానిక బలుసుపాడు రోడ్‌లోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ, పెయింటర్స్, కార్పెంటర్ తదితర వివిధ రంగాలకు చెందిన కార్మికులతో కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు నుంచి అందవలసిన సంక్షేమం ప్రతి కార్మికుడికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అందుతుందని స్పష్టం చేశారు. కూటమి నేతలు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

## ఇసుక స్టాక్ పాయింట్ వద్ద డ్రైవర్ల నిరీక్షణ

- పని చేయని సర్వర్
- మొరాయిస్తున్న నగదు చెల్లింపుల స్కానర్

**అనుమంచిపల్లి(జగ్గయ్యపేట):** గ్రామంలోని జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్ వద్ద మంగళవారం సర్వర్లు పని చేయకపోవటంతో డ్రైవర్లు గంటల కొద్దీ నిరీక్షించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో టన్ను రూ.290లకు లబ్ధిదారులకు ఇవ్వ సంకల్పించింది. దీంతో సోమవారం ఉచిత ఇసుక ప్రారంభించాల్సి ఉండగా సాయంత్రం ఐదు గంటల వరకు ఇసుక విధానంపై నిబంధనలు రాకపోవటంతో అధికారులు, లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఆరు గంటలకు నిబంధనలు రావటంతో ఇసుక విక్రయాలు ప్రారంభించారు. అయితే మంగళవారం లబ్ధిదారుడికి కావాల్సిన ఇసుకకు సంబంధించి నగదు చెల్లింపుల స్కానర్ పని చేయకపోవటంతో పాటు సర్వర్ పని చేయకపోవటంతో ఉదయం ఆరు గంటలకు వచ్చిన డ్రైవర్లు, లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. స్టాక్ పాయింట్ వద్ద ఉన్న రెవెన్యూ, ఎస్ఈబీ, సచివాలయ సిబ్బంది సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కనీసం సమాధానం చెప్పేవారు కూడా లేకపోవటంతో డ్రైవర్లు, లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. ఉచిత ఇసుక అంటూ గంటల కొద్దీ వేచి ఉంచటమేంటని డ్రైవర్లు అధికారులను నిలదీశారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సర్వర్లు పని చేయటంతో విక్రయాలు ప్రారంభించారు.



అనుమంచిపల్లి ఇసుక స్టాకు పాయింట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డ్రైవర్లు

### ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇక్కట్లు

**కీసర(కంచికచర్ల):** మండలంలోని కీసర గ్రామంలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద కూపన్లు తీసుకునేందుకు వినియోగదారులు మంగళవారం బారులు తీరారు. ఒక్కో టన్ను ఇసుక రూ.290 వంతున ధరను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వినియోగదారులు ఇసుక కోసం స్టాక్ పాయింట్ వద్ద క్యూ కట్టారు. ఈనెల 8వ తేదీన ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్పి వేర్వేరు స్టాక్ పాయింట్ల వద్ద వేర్వేరు ధరలను ప్రకటించింది. కొన్ని సార్లు క్యూఆర్ కోడ్ స్కాన్ కాకపోవటంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం ఉదయం వెళ్లిన వినియోగదారులు సాయంత్రం వరకు లోడ్ అవ్వటంలేదని ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా నూతన ఉచిత ఇసుక విధానం అని చెప్పిన ప్రభుత్వం కీసర స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.290 వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

## విద్యార్థులు ప్రకృతిని ప్రేమించాలి

**కాచవరం(ఇబ్రహీంపట్నం):** ప్రకృతిని ప్రేమించడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని హిందీ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇర్ఫాన్‌పాషా అన్నారు. ఇర్ఫాన్‌పాషా సౌజన్యంతో రూ. రెండు వేల విలువైన వివిధ రకాల మొక్కలను స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ నూర్జహాన్ పర్యవేక్షణలో మంగళవారం నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతితో ఆహ్లాదం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. మొక్కల పెంపకంతో మానవాళికి అవసరమైన గాలి, ఆయుర్వేద ఔషధాలు లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, దొంతమాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**నూజివీడు:** విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సింహాద్రి వెంకట్ అన్నారు. నారాయణ స్కూల్‌లో మంగళవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



నూజివీడులో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

## విద్యార్థులకు బస్సు సౌకర్యం

**ముసునూరు:** విద్యార్థులకు బస్సు సర్వీసును ఏర్పాటు చేశామని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. మండలంలోని గుడిపాడు హైస్కూల్‌లో చదువుతున్న గుళ్లపూడి, వలసపల్లి విద్యార్థుల సౌకర్యం కోసం లోపూడి బస్సు సర్వీసును గుళ్లపూడి మీదుగా నడుపుతున్నామని చెప్పారు. నూజివీడు నుంచి లోపూడి వెళ్లే సర్వీసు మంగళవారం నుంచి గుళ్లపూడి, వలసపల్లి, గుడిపాడు చేరుకుని చెక్కపల్లి, రమణక్కపేట, ముక్కొల్లుపాడు మీదుగా నూజివీడుకు ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తుందని చెప్పారు. బస్సు సర్వీసు ఏర్పాటుతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



### సబ్సిడీ మొక్కలకు దరఖాస్తు చేసుకోండి

**ఆగిరిపల్లి:** రైతు సేవా కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక అన్నారు. మంగళవారం కనసానపల్లిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నూతనంగా మామిడి, నిమ్మ, కోకో, కొబ్బరి, ఆయిల్‌పామ్, కూరగాయ పంటలు వేసుకునే రైతులకు మొక్కలు సబ్సిడీపై అందిస్తున్నామని, అవసరమైన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

